క్లుప్తంగా

రేపు తైబజార్ వేలం

నర్వ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ తైబజార్ వేలాన్ని ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న, నిర్వహించిన వేలం అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు. ఎంపీఓ ఆదేశాల మేరకు ఈ నెల 22న, ఉదయం 10:30 గంటలకు వేలం పాట ప్రారంభిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించే వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. గడువు తర్వాత డిపాజిట్లు స్వీకరించబడవన్నారు. తైబజార్ వేలంలో పాల్గొనేందుకు డిపాజిట్లు చెల్లించిన వారు రూ.50 వేలు స్థిరాస్తుల ధృవపత్రాలు ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో మొహర్రం వేడుకల్లో ఏడుగురిపై కేసునమోదైనట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు. మసీదు వద్ద అలాయి ఆడుతుండగా ఒకరికిఒకరు ఘర్షణ పడినట్లు తెలిపారు. ఈ విషయమై లింగప్ప, నాగరాజు, అంజప్ప, లోకేష్, రమేష్, అనీల్, రాజుపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు ఉపాధ్యాయులకు సన్మానం

నారాయణపేట రూరల్: స్థానిక అంజనాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లోని ఆదివారం తపస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీ, పదోన్నతి పొందిన టీచర్లు హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని, తపస్ రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్‌రావు హాజరవుతారని తెలిపారు.

కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

కోస్గి: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపేందుకు ఏర్పాటుచేస్తున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని పీఆర్టీయూటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్‌కుమార్, నల్గొండ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలమూరు జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో సంఘం వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఈ సభకు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ



మరికల్: అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో రైతులకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంతు, చిన్నబాలు, ఎల్లాగౌడ్, ఆనంద్ అన్నారు. మండలంలోని ఎలిగండ్లలో శనివారం సీఎం రేవంత్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఏకకాలంలో చేస్తామని చెప్పిన మాట ప్రకారమే రుణాలు మాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శక్తి పీఠంలో గురుపౌర్ణమి ఉత్సవాలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శక్తిపీఠం శ్రీ సంత్‌మత మూలమహా సంస్థానంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శక్తిపీఠం స్వామీజీ శాంతానంద పురోహిత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శక్తిపీఠం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువులు పూజ్యశ్రీ స్వామి శాంతానంద పురోహిత్ వారికి పాదపూజ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అమ్మవారి గురుదేవుల కృపాకు పాత్రులు కావాలని కోరారు.

కూరగాయలతో విద్యార్థుల ప్రదర్శన

నారాయణపేట రూరల్: చిన్నతనం నుంచే కూరగాయలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంలో పట్టణంలోని శ్రీసాయి స్కూల్‌లో శనివారం వెజిటెబుల్ డే నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు కూరగాలకు సంబంధించిన ఆకారాలు, రంగులు, వాటిని ఆహారంలో తీసుకోవడంతో కలిగే లాభాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప, వైస్ ప్రిన్సిపాల్ అమీనా, టీచర్లు హరీష్, ఉమా, అనసూయ, లక్ష్మి, మాధవి, సుమలత, శ్రావణి పాల్గొన్నారు.



చినుకు పడితే చిత్తడే !



ఎర్గాట్‌పల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇలా..

- బురదమయంగా మట్టిరోడ్లు
- గుంతల్లో చేరిన వర్షపునీరు
- పట్టించుకోని అధికారులు



జీర్ణహల్లికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఊట్కూర్: మండలంలో పలు గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రజలు వర్షాకాలంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఏర్గాట్‌పల్లి, జీర్ణహల్లి, వల్లంపల్లి, చిన్నపొర్ల-ఎడివెల్లి, చిన్నపొర్ల-పులిమామిడి, నిడుగుర్తి-పెద్దజట్రం, ఊట్కూర్-అమీన్‌పూర్, కొల్లూర్-నాగిరెడ్డిపల్లి, బాపూర్-నిడుగుర్తి తదితర గ్రామాలకు మట్టిరోడ్లు ఉన్నాయి. వర్షాకాలంలో మట్టిరోడ్లపై గుంతులు ఏర్పడుతున్నాయి. గుంతలో వర్షపునీరు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాలకు రెవెన్యూ నక్షా ప్రకారం రోడ్డు గుర్తించకపోవడంతో ప్రజలు పొలాల మధ్యలో రాకపోకలు కొనసాగిస్తున్నారు. పలుచోట్ల రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మండలంలో రోడ్లు ఇలా..

ఊట్కూర్ బీటీరోడ్డు నుంచి జీర్ణహల్లి గ్రామానికి 3కిమీ, చిన్నపొర్ల నుంచి ఎడివెల్లి గ్రామానికి 2 కిమీ, బిజ్వార్ నుంచి కొత్తపల్లి 3కిమీ, చిన్నపొర్ల నుంచి పులిమామిడికి 3 కిమీ పెద్దజట్రం నుంచి నిడుగుర్తికి 3కిమీ, పెద్దజట్రం నుంచి మొగ్దుంపూర్‌కి 3 కిమీ, ఊట్కూర్ నుంచి అమీన్‌పూర్‌కి 5కిమీ, కొల్లూర్‌నుంచి నాగిరెడ్డిపల్లికి 2కిమీ, బాపూర్ నుంచి నిడుగూర్తికి 2కిమీ, మట్టి రోడ్లు ఉన్నాయి. ఊట్కూర్ నుంచి సమస్తాపూర్ బీటీరోడ్డు వరకు 3కిమీ, వల్లంపల్లి నుంచి నారాయణపేటకు 3 కిమీ, మెటల్‌రోడ్లు ఉన్నాయి.

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి..



బిజ్వార్ నుంచి తమ గ్రామం వరకు 3కిమీ మట్టి రోడ్డు ఉంది. వర్షాకాలంలో రోడ్డుపై గుంతలో నీరు నిలిచి ప్రయాణించేందుకు ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనంపై వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి.

– రాజేష్, కొత్తపల్లి, ఊట్కూర్

ప్రయాణించేందుకు కష్టంగా ఉంది..



మొగ్దుంపూర్ బీటీరోడ్డు నుంచి మా గ్రామం వరకు 3కిమీ మట్టి రోడ్డు ఉంది. ఒక కిమీ రోడ్డు నక్ష ప్రకారం లేకపోవడంతో పొలాల మధ్యలో వెళ్తున్నాం. వర్షాకాలంలో రోడ్లపై గుంతలో నీరు చేరడంతో ప్రయాణించేందుకు కష్టంగా ఉంది. గతంలో బీటీ రోడ్డుకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. వెంటనే స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ఆంజనేయులు, జీర్ణహల్లి, ఊట్కూర్

ప్రతిపాదనలు పంపించాం...

మండలంలోని కొత్తపల్లి, సమస్తాపూర్, వల్లంపల్లి, ఎడివెల్లి, పెద్దజట్రం తదితర గ్రామాలకు బీటీ రోడ్లపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

– జగత్‌చంద్ర, ఏఈ (పీఆర్) ఊట్కూర్

అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి..



ఊట్కూరులో సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జీవరత్నం



మాగనూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం బలరాం

ఊట్కూరు: విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్ని రంగాలలో ప్రోత్సాహించాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. శనివారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు క్రీడలపై ప్రోత్సాహించాలన్నారు. తల్లిదండ్రులు నిత్యం విద్యార్థి పాఠశాల ప్రగతిని పరిశీలిస్తూ ఉండాలని, ప్రతి నెల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిపై చర్చ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహణపై తల్లిదండ్రులు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుసుమ, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, మురళి, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలలో మరింత విద్యాభివృద్ధి జరుగుతుందని జీహెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని మీర్జాపూర్, ముశ్రీఫా, కోస్గి జెడ్పీ బాలుర ఉన్నతపాఠశాలతో పాటు పలు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. జీహెచ్‌ఎంలు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను కొంత సమయం తమ పిల్లలకు కొంత సమయం కేటాయించి చదువు సామార్థ్యం తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో సైతం జవాబుదారి తనం పెరుగుతుందన్నారు. ఇంటి వద్ద చదువుకునే తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌ఎంలు వెంకటేశ్వరీ, శేఖరయ్య, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలకు తల్లిదండ్రులు వారి పిల్లలను పంపించి హాజరును పెంపొందించాలని హెచ్‌ఎం బలరాం అన్నారు. శనివారం మండలంలోని గురువలింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, మాజీ చైర్మన్ కృష్ణయ్య గౌడ్, నర్సింహులు, అశోక్, తిమ్మప్ప, రమేష్, అంజప్ప పాల్గొన్నారు.

నర్వ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని హెచ్‌ఎం ఎ.కృష్ణయ్య అన్నారు. శనివారం పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ మణెమ్మ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. పదోతరగతిలో మండలస్థాయిలో టాపర్‌గా నిలిచిన రాజేశ్వరి తండ్రి చిన్న కథలప్ప, మండల సెకండ్ టాపర్‌గా నిలిచిన సింధు, నందినినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సదన్‌రావు, గోవిందు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి



పాథర్చేడ్‌లో విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముసురు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట రూరల్: ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ ఒక ప్రకటనలో కోరారు. మట్టిమిద్దెలు, గుడిసెలలో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, చెరువుల సమీపంలో ఉన్న ప్రజలు భారీ వర్షాలకు వచ్చే వరదలపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో ఒకవేళ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తం కావాలని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లో లెవల్ వంతెనలపై నీరు వచ్చిన చోట్ల పరిస్థితిని బట్టి వాహనాల రాకపోకలను నిలిపివేయా లని, వరద నీరు వచ్చే ప్రాంతాలు, లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే విధంగా సూచనలు చేయాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్‌చేసి పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహ ప్రంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు దిగడానికి, రీల్స్ చేసే సాహసోపేత చర్యలకు పూనుకోరాదని, రోడ్లపై వాహనాలను నడిపే సమయంలో తగిన జగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీ శక్తిపీఠంలో శనివారం అమ్మవారికి ఎంపీ. డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు.. అర్చకులు, వేదాపండితులు వేదమంత్రాల మధ్య స్వాగతం పలికారు. అనంతరం శక్తిపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శాంతనంద స్వామీజీ శాలువాతో సన్మానించి అమ్మవారి ఆశీర్వచనాలు చేశారు. ఎంపీతోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

మరికల్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం భక్తులు ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న దత్తాత్రేయ స్వామికి పూజలు చేశారు. పూజారి వర్కూరి సత్యనారాయణ భక్తులచే హోమం చేయించారు. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడుతున్న పోలీస్ సిబ్బందిని సన్మానించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు ఉచిత చెస్ శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కోస్గి:అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఉచిత చెస్ శిక్షణ తరగతులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రమే మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. సంపూర్ణ శిక్షణ అనంతరం విద్యార్థులకు మండలస్థాయిలో చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సలహాదారు వీరు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ముస్తాబు..



పేటలో ముస్తాబైన ఆలయం

నారాయణపేట: గురుపౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అమృతసాయి ఆలయం, సాయి హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం అమృతసాయి మందిరంలో ఉదయం 5:15 గంటలకు కాకర హారతి, 6గంటలకు గణపతి పూజ, 7:30 గంటలకు బాబా వారికి క్షీరాభిషేకం, 9గంటలకు హారతి, మధ్యాహ్నం 12గంటలకు హారతి, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం ధూపహారతి, 6:30 గంటలకు పల్లకీసేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రక్తదాన శిబిరం..

షిర్డీసాయి హనుమాన్ ఆలయం వద్ద స్థానిక స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఈ పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరవుతారని తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల

మద్దూరు: రాజయోగి తపస్వి ధర్మగురు సంత్ శ్రీ రామ్‌రావు మహారాజ్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని పల్లెగడ్డ తాండాలో బంజార సమితి నాయకులు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయక్ మాట్లాడుతూ.. గురపౌర్ణమి సందర్భంగా జిల్లాలోని అన్ని తాండాల్లో రాంరావు మహారాజ్ జయంతి నిర్వహించాలని సూచించారు. అలాగే తప్పనిసరిగా తాండాల్లో ఐదు వేప మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో బంజరా సంఘం నాయకులు లక్ష్మణ్‌నాయక్, కిష్ట్యానాయక్,రాజునాయక్, చందర్‌నాయక్, జయరాం, చంద్ర్యనాయక్, వాసులు, భోజ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఐదు మొక్కలు నాటాలి..



మొక్కలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ పాఠశాలలో శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకులు అంజిరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలను నాటాలనే లక్ష్యంతో పాఠశాల ఉపాధ్యాయులకు మొక్కలను అందజేశామన్నారు. నాటిన మొక్కలను కాపాడుకోవాలని సూచించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



మరికల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ మహేశ్వరి



ధన్వాడలో ..

మరికల్: మండల కేంద్రంలోని హరిజన్‌వాడ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సూపర్‌వైజర్ మహేశ్వరి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ రెండేళ్లలోపు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి అక్షరాభ్యాసం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేసి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అనంతరం చిన్నారులతో అక్ష్యరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు మరియమ్మ, మాజీ వార్డు సభ్యులు, రాజు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ మేరకు.. 2నుంచి 5 సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాణి, భూదేవి, శారధా, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఊట్కూరు: మండలంలోని అంగన్‌వాడీ టీచర్‌లు అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం గురునాథ్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు విధిగా పంపించాలన్నారు. ప్రభుత్వం చిన్నారులకు ఆటపాటలతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, రమాదేవి, జ్యోతి, పుష్పమ్మ, రిజ్వానబేగం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కొనసాగిన మధ్యాహ్న భోజనం



అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న మహిళా కార్మికులు

అమరచింత: మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వంట ఏజెన్సీ మహిళలు శనివారం తలపెట్టిన ధర్నా కార్యక్రమం వాయిదా పడటంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం యధావిధిగా అందించారు. ఐదు నెలల నుంచి వంట ఏజెన్సీలకు బిల్లులు అందటం లేదని, వీటితో పాటు గుడ్డు బిల్లులు, గౌరవ వేతనం అందటం లేదంటూ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరెట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. దీంతో శనివారం పాఠశాలలో భోజనం తయారు చేయకుండా ఏజెన్సీ మహిళలు గతంలోనే ఎంఈఓలకు వినతిపత్రాలు ఇవ్వడంతో ప్రధానోపాధ్యాయులు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించారు. తీరా ధర్నా కార్యక్రమం ముసురు వర్షాల కారణంగా వాయిదా పడటంతో విద్యార్థులకు మహిళా కార్మికులే మధ్యాహ్న భోజనం వండి వడ్డించారు.

ఓబ్లాపూర్ బస్సు సమయాన్ని సవరించాలి

నారాయణపేట రూరల్: ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్, పగిడిమారి విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సు సమయాన్ని మార్పు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి శనివారం వేర్వేరు ప్రకటనలో కోరారు. వాస్తవానికి విద్యాసంస్థలు 9:30 గంటలకు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మక్తల్ నుంచి 7:15కు బయలుదేరి పేటకు 8:15వరకు వచ్చేవిధంగా సమయపాలన సిద్ధం చేశారు. దీంతో గంటకుపైగా సమయం ముందుగా విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు రాలేరని, వెంటనే సమయం మార్పుచేసి 9: గంటల తర్వాత పట్టణానికి వచ్చేవిధంగా చూడాలని కోరారు.

మట్టి టిప్పర్ పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని ఒబ్లాపూర్ గేట్ సమీపంలోని ఎర్ర మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. వివరాలిలా.. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పొలం నుంచి ఎర్ర మట్టి మక్తల్‌కు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. అయితే విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న వీఆర్ఏలకు టిప్పర్ కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా ఎర్ర మట్టి కోసం తరలిస్తున్నట్లు ఆర్ఐ శ్రీశైలంకు సమాచారమివ్వడంతో టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఖబ్రస్తాన్‌ను పరిరక్షించాలని వినతి

ఆత్మకూర్: పట్టణంలోని సర్వేనంబర్ 1 లోని ముస్లింల ఖబ్రస్తాన్ స్థలాన్ని పరిరక్షించాలని స్థానిక ముస్లింలు శనివారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. అతిపురాతనమైన శ్మశానవాటికలోని సమాధులను ధ్వంసం చేసి ఎంతో విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోను సమాధులను ధ్వంసం చేసారని, ప్రస్తుతం జేసీబీ ద్వారా ఈ తంతు కొనసాగిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజు పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు.ముస్లింలు గయాసుద్దీన్, షాహేద్, వాహేద్ ఉన్నారు.

మున్సిపాలిటీలో సహాయక కేంద్రం ఏర్పాటు

అమరచింత: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా సహాయక కేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. పట్టణంలోని పది వార్డుల్లో మట్టిమిద్దెలు, వర్షాలకు కురుస్తున్న ఇళ్ల వివరాలను తెలుసుకుని వారి ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను సహాయక కేంద్రాలకు తరలించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. పట్టణంలోని కమ్యూనిటీ కేంద్రాల్లో ప్రజలు నివసించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర సేవల కోసం 99631 26840, 96422 53317 సెల్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిచాలని కోరారు.